

ఇట్స్ స్కూల్ టైమ్..

స్టేషనరీ దుకాణాలు కిటకిట

వేసవి సెలవులు ముగియడంతో పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. బుధవారం బడులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం స్టేషనరీ దుకాణాలు కిటకిటలాడాయి. ఉదయం నుంచి రాత్రి వరకు స్టేషనరీ, బ్యాగులు, షూస్, లంచ్ బాక్స్, వాటర్ బాటిల్ తదితర వస్తువులు కొనుగోలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు కనిపించారు. – సుభాష్‌నగర్

ప్రభుత్వ కార్యాలయాలు.. పోటెత్తిన జనాలు



లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది మూడు నెలలుగా బిజీగా ఉండటంతో కార్యాలయాల్లో ఫైల్స్ ముందుకు జరగలేదు. మళ్లీ అధికారులు విధులకు చేరడంతో 3 రోజుల నుంచి జనాలు కార్యాలయానికి పెద్ద సంఖ్యలో వస్తున్నారు. తహసీల్దార్ రెహమాన్ ఖాన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రజనీకాంత్, ఇతర సిబ్బంది సెలవుల్లో ఉండటంతో ఫైల్ ముందుకు సాగడం లేదు. దీంతో పనులు కాక ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. – సుభాష్‌నగర్

నో పార్కింగ్.. నౌ స్కూల్ స్టార్టింగ్!



నందానగర్‌లోని పాఠశాల ఆవరణలో కార్ల పార్కింగ్

రంగారెడ్డినగర్: వీధుల్లో కార్లు, ఇతర వాహనాలను పార్క్ చేయడం మన చూసి ఉంటాం.. కాని ఆ గల్లీ వాసులు ఏకంగా పాఠశాల ఆవరణనే పార్కింగ్‌కు అడ్డాగా మార్చుకున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి నందానగర్‌లోని మండల పరిషత్ పాఠశాల అక్రమ పార్కింగ్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పాఠశాల హెడ్‌మాస్టర్ పలుమార్లు స్థానికులతో మాట్లాడినా ప్రయోజనం లేకుండాపోయింది. ఈ స్థలంలో పాఠశాల, బస్తీదవాఖానా, కమ్యూనిటీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో అరకొరగా ఉన్న ఖాళీ జాగాను సైతం అక్రమించి వాహనాలను నిలుపుతుండటంతో విద్యార్థులకు ఆడుకునే స్థలమే కరువైందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. ఈ విషయమై విద్యాశాఖ ఉన్నతాధికారులైనా కల్పించుకుని కార్లు, ఇతర వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

ఒకటి నుంచి ఐదు తరగతులకు
ఒకే ఒక్కడు



మహేశ్వరంలోని ప్రాథమిక పాఠశాల..



వరండాలోనే విద్యార్థుల చదువులు (ఫైల్)



ఒకే గదిలో విద్యార్థుల బెంచీలు, బియ్యం బస్తాలు, ఇతర ఆఫీస్ సామగ్రి

దుండిగల్: ఒకే ఒక్క ఉపాధ్యాయుడు.. ఒక్కటే తరగతి గది.. కానీ అందులో మాత్రం ఒకటి నుంచి 5వ తరగతి వరకు 61 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. జ్వరమో.. మంచో.. చెడో.. ఇతర కారణాలతో ఆ సారు లీవ్ పెడితే ఇక ఆ రోజు స్కూల్ మూత పడాల్సిందే. విద్యార్థి ఉపాధ్యాయుడు చెప్పే పాఠశాలను శ్రద్ధగా విని అర్థం చేసుకుని చదువుకుంటునే పరీక్షల్లో పాస్ అవుతాడు. కాని ఇక్కడ విచిత్రమేమిటంటే.. ఒకటో తరగతి విద్యార్థి తన పాఠాలతో పాటు 2 నుంచి 5వ తరగతి పాఠాలు, 2వ తరగతి విద్యార్థి 1, 3,4,5 తరగతుల పాఠాలు, ఇలా తన విద్యా సంవత్సరంతో పాటు మిగిలిన తరగతుల పాఠాలను ప్రతి రోజు వింటున్నారు. తీరా పరీక్షలు వచ్చే సమయానికి విద్యార్థి మానసిక సంఘర్షణకు గురవుతున్నాడు. ఇది కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాథమిక పాఠశాలల దుస్థితి.

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండిమైసమ్మ-దుండిగల్ మండలంలోని మహేశ్వరంలో ఒకే తరగతి గదిలో ఒకటి నుంచి 5వ తరగతి కొనసాగుతోంది. ఇందులో మొత్తం 61 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఒకే ఉపాధ్యాయుడు ఉన్నాడు.
- శంభీపూర్‌లో మూడు తరగతి గదులు ఉండగా ఒకటి వంట గది, రెండు తరగతి గదులు ఉన్నాయి. ఇక్కడ 82 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడా ఒక్కడే ఉపాధ్యాయుడు.
- న్యూ కొంపల్లిలో ప్రాథమిక పాఠశాల ఓ ప్రైవేటు భవనంలో కనసాగుతుంది. ప్రభుత్వ పక్కా భవనం సైతం ఈ పాఠశాలకు లేదు. ఇక్కడ 66 మంది పిల్లలు ఉన్నారు. ఇక్కడ కూడా ఒక్కరే ఉపాధ్యాయులు.
- నాగులూరులోనూ రెండు తరగతి గదుల్లో 37 మంది విద్యార్థులు ఉండగా ఇక్కడా ఒక్కడే ఉపాధ్యాయుడు. దీంతో పాటు కొంపల్లిలోని ఉమామహేశ్వర కాలనీ, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని నందానగర్, వినాయక నగర్, గుడెన్‌మెట్, కళావతీనగర్, లాల్‌సాహెబ్‌గూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలది ఇదే పరిస్థితి. కొన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తు కాలం వెల్లదీస్తున్నారు. ఆ పాఠశాలల సంఖ్య 40కి పైగానే ఉంటుంది.

అన్ని సబ్జెక్టులకు ఒకే ఉపాధ్యాయుడే..

- 1,2 తరగతుల్లో మూడు, 3,4,5 తరగతుల్లో 4 చొప్పున ఒకటి నుంచి 5వ తరగతి వరకు మొత్తం 18 సబ్జెక్టులు ఉంటాయి. అయితే ప్రతి రోజు ఒకే ఉపాధ్యాయుడు 5 తరగతులకు 18 సబ్జెక్టులను బోధించాలి.
- పాఠశాల ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుంది. ఇంటర్వెల్, మధ్యాహ్న భోజనానికి ఒక గంట మినహాయిస్తే 6 గంటలు క్లాస్లు ఉంటాయి.
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు ఒక్కో తరగతికి తెలుగు సబ్జెక్టుకు గంటన్నర, మ్యాథ్స్‌కు గంటన్నర, ఇంగ్లీష్‌కు 45 నిమిషాలు, ఈవిఎస్‌కు 45 నిమిషాలు, లైబ్రరీకి గంట సమయం కేటాయించాలి.
- ఇలా చూసుకుంటే ఉపాధ్యాయుడు రోజంతా ఒకే తరగతికి పాఠాలు బోధించాలి. కానీ ఇక్కడ 5 తరగతులకు సదరు ఉపాధ్యాయుడే పాఠాలు బోధిస్తున్నాడు. అది ఎలా సాధ్యపడుతుంది.?
- గంటన్నర సమయాన్ని కేవలం 10 నుంచి 15 నిమిషాలకే కేటాయించడం, ఒక్కో సారి పూర్తి సిలబస్ కాకపోవడం, నాణ్యమైన విద్యను అందించకపోవడం జరుగుతుంది. అయితే కొన్ని పాఠశాలల్లో కార్పొరేట్ సంస్థలు, కొందరు వ్యక్తులు తమ సొంత డబ్బులు వెచ్చించి కొంత మంది విద్యా వలంటీర్లను ఏర్పాటు చేసినా ఫలితం మాత్రం కనిపించడం లేదు.

వేధిస్తున్న గదుల కొరత..

- కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్, కుత్బుల్లాపూర్, బాచుపల్లి మండలాల్లో మొత్తం 107 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 85 ప్రాథమిక, ఒక ప్రాథమికోన్నత, 21 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో చాలా వరకు పాఠశాలల్లో గదుల కొరత తీవ్రంగా ఉంది.
- ప్రాథమిక పాఠశాలలకు 5 గదులు, వంట గది, ఆఫీస్ రూమ్, స్టాఫ్ రూమ్‌లు ఉండాలి. కొన్ని మినహా మెజార్టీ పాఠశాలల్లో కేవలం రెండు, మూడు గదుల్లోనే సర్దుకుపోతున్నారు.
- ఒక తరగతి గదిలో 1:40 నిష్పత్తి ఉండగా కుత్బుల్లాపూర్, గురుమూర్తి నగర్, జగద్గిరినగర్ లాంటి పాఠశాలల్లో ఒకే గదిలో రెట్టింపు మంది విద్యార్థులు ఉన్నారు.

ఆ పాఠశాలకు శాశ్వత ఉపాధ్యాయులే లేరు..

- గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లోని స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2003లో పాఠశాలను ఏర్పాటు చేసి సొంత డబ్బులతో ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి పాఠశాలను నడిపించారు. 100 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలను ప్రభుత్వం గుర్తించాలని స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో 2007లో మండల ప్రాథమిక పాఠశాల మంజూరు చేసింది. అప్పటి నుంచి ఉపాధ్యాయులను కేటాయించలేదు. స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సొంత డబ్బులతో ఉపాధ్యాయులకు జీతాలు చెల్లిస్తూ నడిపించారు. ఈ విషయాన్ని పలుమార్లు 'సాక్షి'ప్రచురితం చేయడంతో గత సంవత్సరం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను డిప్యూటేషన్ పై నియమించారు. వచ్చిన ఉపాధ్యాయులను తరచు మారుస్తుండడంతో విద్యార్థుల చదువు తీవ్ర ఆటంకంగా మారింది. సంబంధిత అధికారులు పాఠశాలకు శాశ్వత ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతున్నారు.

శాశ్వత ఉపాధ్యాయులను కేటాయించండి..



గత కొన్ని సంవత్సరాలుగా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంచలంచెలుగా పాఠశాలను అభివృద్ధి చేస్తూ వచ్చాం. గత 20 సంవత్సరాలతో పోలిస్తే ఇక్కడ జనాభా పదింతులు వృద్ధి చెందింది. విద్యార్థులకు సరిపడా పర్మినెంట్ ఉపాధ్యాయులను కల్పించకపోవడంతో, ఇతర పాఠశాలలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు తక్షణమే డిప్యూటేషన్ పై కాకుండా పర్మినెంట్ గా ఉండే ఉపాధ్యాయులను నియమించాలి.

– ఈ. చిన్నా, బాలయ్యనగర్



బాలయ్యనగర్‌లోని ప్రాథమిక పాఠశాల..



న్యూ కొంపల్లిలో..



ప్రైవేటు భవనంలో ప్రాథమిక పాఠశాల..

'అధికారులు కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు'

జగద్గిరిగుట్ట: రెండు నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న సంబంధిత అధికారులు లేరని చెబుతూ ఉండటంతో కొందరు చెందారు. ఈ క్రమంలో వారికి వినూత్న ఆలోచన వచ్చింది. వెంటనే వారు ''మా తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ, ఇతర సిబ్బంది కనిపించడం లేదు''అనిని జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యాసంస్థలు తెరుచుకోనున్న నేపథ్యంలో కుల, ఆదాయ, గ్యాప్ సర్టిఫికెట్ల కోసం రెండు నెలలుగా కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన కల్యాణలక్ష్మి, స్థలాల సర్వే తదితర పనుల కోసం కార్యాలయానికి వస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తహసీల్దార్ ఈనెల 18వ తేదీ వరకు సెలవులో ఉండటంతో తాము ఏమి చేయాలని సిబ్బంది చెబుతున్నారు. పత్రాలు కళాశాలల్లో సమర్పించాల్సి ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసిన వారిలో మధుసూదన్, సాయిగౌడ్, రషీద్, మధుబాబు, షబ్బీర్ ఉన్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా రూప్‌సింగ్

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాచుపల్లి మండల తహసీల్దార్ రూప్‌సింగ్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అబ్దుల్ రహమాన్‌ఖాన్ పది రోజులు సెలవు పెట్టడంతో ఆయన స్థానంలో రూప్‌సింగ్ కొనసాగనున్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ

దుండిగల్: వర్షాకాలంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ ఆదేశించారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ,సీజనల్ వ్యాధుల నివారణ, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అవసరమైన మెషీన్లతో కూడిన అత్యవసర యంత్రాంగం,చేపట్టనున్న ముందస్తు చర్యలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

ఫోన్ నం.95427 15377కు సమాచారం ఇవ్వండి..

వర్షాకాలంలో ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా మున్సిపాలిటీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర సమయాల్లో పట్టణ ప్రజలు ఫోన్ నం. 95427 15377కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్ కుమార్, మేనేజర్ నర్సింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలి

రాష్ట్ర బీసీ ఐక్య వేదిక డిమాండ్

కుత్బుల్లాపూర్: తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి బీసీలకు ఇవ్వాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు కోరారు. మంగళవారం కుత్బుల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీల మద్దతులో మూడోసారి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో సైతం మెజార్టీ బీసీలు బీజేపీకి అండగా నిలిచారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 70 కోట్ల మంది బీసీ కులస్తులను దృష్టిలో ఉంచుకుని బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. విధంగా కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి బీసీల అభ్యున్నతి కృషి చేయాలన్నారు. ఇటీవల నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలు జరిగాయని చాలా మందికి 720/720 మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఒకే గదిలో ఐదుగురికి ఈ మార్కులు రావడం అనుమానంగా ఉందన్నారు. దీనిపై సిటింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఈ సమావేశంలో దశరథం, కొత్త అశోక్, రంగు క్రాంతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5లక్షల డ్రగ్స్ పట్టివేత

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు

కుత్బుల్లాపూర్: డ్రగ్స్ అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం గండిమైసమ్మ ప్రాంతంలో తనిఖీ చేస్తుండగా ఓ బైక్‌లో ఎండీఎంఏ రకం డ్రగ్స్ బయటపడ్డాయి. బెంగుళూరు నుంచి కిరణ్ అనే వ్యక్తి హైదరాబాద్‌కి సరఫరా చేస్తుంటాడని నిందుతులు షోయబ్, క్రాంతి ఒప్పుకున్నారు. ఈ డ్రగ్స్ విలువ రూ.2.50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో వీరిని పట్టుకున్న సిబ్బందిని ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ అభినందించారు.

విద్యతో పాటు క్రమశిక్షణ నేర్పించాలి

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జీడిమెట్ల: విద్యతో పాటు విద్యార్థులకు క్రమశిక్షణను నేర్పించాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. మంగళవారం సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బోధివక్ష స్కూల్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశాలమైన స్థలంలో అన్ని సదుపాయాలతో పాఠశాలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి, పాఠశాల యాజమాన్యం మహేందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, భార్గవి, రంగారావు, పాలె శ్రీకాంత్, టీటీకే శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, తులసి, ఇస్మాయిల్, శేఖు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో రణరంగం

- అధికారులు స్పందిచకపోవడంతో అక్రమ నిర్మాణాలను కూల్చిన స్థానికులు
- కోపోద్రిక్తులైన కబ్జాదారుల దాడుల్లో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తి



కబ్జాదారుల దాడుల్లో గాయపడ్డ వ్యక్తి



ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను స్థానికులు కూల్చివేసిన దృశ్యం

సుభాష్‌నగర్: గాజులరామారంలోని సర్వే నం.13లోని ప్రభుత్వ స్థలం రణరంగంగా మారింది. స్థానికంగా సర్వే నం.13లో ఎకరాకు పైగా ప్రభుత్వ స్థలం ఉండగా సదరు స్థలాన్ని కాజేసేందుకు కొంతమంది కబ్జాకు తెరలేపారు. ఈ విషయమై గత 3 నెలలుగా 'సాక్షి'ఎప్పటికప్పుడు తెరమీదికి తీసుకురావడం.. రెవెన్యూ అధికారులు వాటిని కూల్చివేయడం.. ఆనవాయితీగా మారింది. తాజాగా వారం రోజుల క్రితం నుండి స్థానిక తహసీల్దార్ రెహమాన్‌ఖాన్ సర్వే నం.13లోని ప్రభుత్వ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేస్తామని సన్నాహాలు చేపట్టడంతో అప్రమత్తమైన కబ్జాదారులు ఆది, సోమవారాల్లో 2 గదులు 3 బేస్‌మెంట్లను నిర్మించారు.

- బుధవారం పక్కనే ఉన్న కాలనీవాసులు గమనించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఎవరి ఫోన్లు పని చేయకపోవడంతో స్వయంగా ఆ కాలనీవాసులు కబ్జా నిర్మాణాన్ని కొంత కూల్చివేశారు. దీంతో కోపోద్రిక్తులైన కబ్జాదారులు మాకుమ్మడిగా కాలనీవాసులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఓ వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం కాలనీవాసులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా సదరు స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు.



గాజులరామారంలో కమ్ముకున్న కారు మేఘాలు

వాతావరణం చల్లబడింది.!

నిన్న మొన్నటి వరకు భానుడి భగభగలతో అట్టుడికిన వాతావరణం మంగళవారం ఒక్కసారిగా చల్లబడింది. గాజులరామారంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో నల్లటి కారు మబ్బులు ఆకాశాన్ని కమ్మేశాయి. గాజులరామారంలో కనిపించిన ఈ దృశ్యాన్ని 'సాక్షి'కెమెరా క్లిక్‌మనిపించింది. ఆ తర్వాత భారీ వర్షం కురిసింది. – సుభాష్‌నగర్

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దంటూ వినూత్న ప్రచారం

- రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తిస్తున్న రిసోర్స్ పర్సన్స్
- వాళ్ల ఇంటికి వెళ్లి పారిశుద్ధ్య ఆటోలకు ఇవ్వాలని విన్నపాలు

కుత్బుల్లాపూర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా రిసోర్స్ పర్సన్స్ అవగాహన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. డివిజన్ల వారీగా ఏరియాలను ఎంపిక చేసుకుని స్థానికంగా చెత్త వేసే వారిని గుర్తించి ఇంటికి వెళ్లి మరీ చెత్త బయట వేయొద్దని కోరుతున్నారు. స్వచ్ఛ ఆటోలకు వేయాలని, తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని సూచిస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని కుత్బుల్లాపూర్, సుభాష్ నగర్, జీడిమెట్ల, రాఘవేంద్ర కాలనీ తదితర నాలుగు ప్రాంతాల్లో ఎలిమినేటెడ్ పాయింట్లను గుర్తించి అక్కడ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు చెత్త బయట వేసే వారిని గుర్తించి వారిలో అవగాహన కల్పించే దిశగా అడుగులు వేస్తున్నారు.

బయట చెత్త వేయకుండా అవగాహన...

ప్రాజెక్ట్ అధికారి హిమబిందు, కమ్యూనిటీ ఆర్గనైజర్ కిషోర్ పర్యవేక్షణలో 11 మంది మహిళలు గత వారం రోజులుగా ఇంటింటికీ తిరుగుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. రాబోయే రోజుల్లో బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కట్టడి చేసే ఆలోచనలో గ్రేటర్ అధికారులు ఉన్నారు. బయట చెత్త వేస్తే జరిగే అనర్థాలపై రిసోర్స్ పర్సన్ మహిళలు వారికి వివరిస్తూ వస్తున్నారు. మంగళవారం సీఎంఆర్ స్కూల్ సమీపంలో చెత్త పాయింట్ వద్ద ఉదయం 6 నుంచి 10గంటల వరకు అవగాహన కల్పించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిని గుర్తించి వాళ్ల ఇంటికీ వెళ్లి పారిశుద్ధ్య ఆటోలకు ఇవ్వాలని కోరారు. వీరి ప్రచారం వల్ల ప్రజల్లో కొంతమైనా మార్పు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

వ్యాపారం సల్లగుంది!



వేసవిలో తాటి ముంజలకు భలే గిరాకీ ఉంటుంది. దీంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల తాటి ముంజలు తీసుకొచ్చి జగద్గిరిగుట్టలో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. కాగా రెండు రోజులుగా వాతావరణం చల్లబడటంతో గిరాకీ తగ్గింది. గిరాకీ లేకపోవడంతో విక్రయదారులు అక్కడే ఓ కునుకు తీస్తూ కనిపించారు. – జగద్గిరిగుట్ట